క్లుప్తంగా

వైభవంగా శ్రీనివాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులకు అభిషేకాలు జరిపి, అలంకరణ చేశారు. అనంతరం శ్రీనివాస కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు 169 మంది ఎంపిక



రాత పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన క్యాంపస్ రాత పరీక్షలకు చక్కటి స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన మేధా సర్వో డ్రైవ్స్ సంస్థలో ఉద్యోగాల నిమిత్తం జరిగిన టెస్ట్‌కు ఉమ్మడి విశాఖ జిల్లాలోని 18 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు చెందిన 401 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 169 మంది క్యాంపస్ ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. వీరికి బుధవారం ఇంటర్వ్యూలు జరుగుతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

పరీక్ష సామగ్రి వితరణ



స్టేషనరీ సామగ్రి అందిస్తున్న నారాయణరావు

పెందుర్తి: స్థానిక ఎస్సీ బాలికల వసతిగృహంలోని టెన్త్ విద్యార్థులకు జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. మంగళవారం హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో 110 మంది విద్యార్థులకు ప్లాంక్‌లు, వసతిగృహానికి బ్లాక్ బోర్డు అందజేశారు. వసతి గృహం సంక్షేమాధికారి సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న జస్టిస్ వరలక్ష్మి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన సంస్కృతోన్నత పాఠశాలలో విద్యార్థులకు పోక్సో చట్టంపై విశాఖ రెండవ అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ జస్టిస్ ఎస్.వరలక్ష్మి మంగళవారం అవగాహన కల్పించారు. చిన్న పిల్లలపై జరిగే నేరాలు, నియంత్రణకు జాగ్రత్తలను వివరించారు. గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు, పాఠశాల హెచ్ఎం భాను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభోత్సవం



హైమాస్ట్ వీధి లైట్లను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

పరవాడ: దేశపాత్రునిపాలెంలో వీధి లైట్ల ఏర్పాటుకు కృషి చేస్తామని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సహకారంతో గ్రామంలో మంజూరైన 5 హైమాస్ట్ లైట్లను ఆయా కూడళ్లలో మంగళవారం ప్రారంభించారు. ఇందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మచ్చ శివ, నాయకులు కరణం అప్పారావు, పూడి బాబూరావు, మోహన్‌రావులు పాల్గొన్నారు.

వార్డులో వీధి దీపాల ఏర్పాటుకు కృషి



హైమాస్ట్ లైటు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వసంత

పెందుర్తి: వార్డు పరిధిలో పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామని జీవీఎంసీ 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత అన్నారు. చాణిక్యనగర్‌లోని పార్కులో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైటును మంగళవారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ దీపాల సమస్య ఎక్కడ ఉన్నా తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు శానాపతి శంకర్రావు, కాలనీ ప్రతినిధులు చిన్నారావు, జగ్గారావు, వెంకట్రావు, దేముడు, కృష్ణమూర్తి, శ్రీనివాస్, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

- నేడు అంతకాపల్లి ముత్యాలమ్మ తొలేళ్ల సంబరం
- రేపు అమ్మవారి పండగ మహోత్సవం
- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి తరలి రానున్న భక్తులు
- 9 రోజులపాటు మాంసాహారానికి దూరం

కొమ్ము కాల్చితే.. కొంగు బంగారం

వేపగుంట ఇలవేల్పు ముత్యమాంబ సంబరాలకు విస్తృత ఏర్పాట్లు



అంతకాపల్లిలో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారు

సబ్బవరం/పెందుర్తి:

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రసిద్ధిగాంచిన సబ్బవరం మండలం అంతకాపల్లి ముత్యాలమ్మ తల్లి జాతరకు సన్నాహాలు పూర్తయ్యాయి. జిల్లాలోనే అతిపెద్ద తొలేళ్ల సంబరం బుధవారం రాత్రి నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. నెల రోజుల ఈ జాతరలో ప్రధాన ఘట్టం తొలేళ్ల సంబరం ఏటా అంబరాన్ని తాకేలా నిర్వహిస్తారు. ఇందుకోసం గ్రామంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లక్షలాది రూపాయల విలువైన బాణసంచా వెలుగులు ప్రత్యేక ఆకర్షణ. మరోవైపు నగరంలో అతిపెద్ద జాతరల్లో ఒకటిగా నిలిచే వేపగుంట ఇలవేల్పు ముత్యమాంబ అమ్మవారి పండగకు కూడా ఏర్పాట్లు పూర్తయ్యాయి. భారీ ఎత్తున అమ్మవారి పండగ నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. బుధవారం రాత్రి అమ్మవారి పండగ తొలేళ్ల సంబరం జరగనుంది.

కొమ్ము.. బాణసంచా ప్రధానాకర్షణ

జాతరలో తొలేళ్ల సంబరం అద్భుతంగా ఉంటుంది. అమ్మవారి ఘటాలను అధికశాతం మంది మహిళలే ఊరేగిస్తారు. పురుషులు స్త్రీ వేషధారణలో గరగలు కట్టి నృత్యం చేస్తారు. భజనలు, కోలాటాలు, పలు జానపద విన్యాసాలకు కొదవుండదు. తొలేళ్ల రోజు 'కొమ్ము'కాల్చడం ఆనవాయితీ. పశువుల కొమ్ముల్లో మందుగుండు పెట్టి, కొందరు చిచ్చు బుడ్డీలు చేత్తో పట్టుకుని కాలుస్తారు. గాయాలైనా ఎవరూ ఆస్పత్రికి వెళ్లరు. అమ్మవారి పసుపు-కుంకుమను గాయాలకు రాసుకుంటారు. అమ్మవారి సన్నిధిలో కొమ్ము కాలిస్తే తమకు మంచి జరుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. జాతర మొత్తానికి కొమ్ము, బాణాసంచా కాల్చడమే ప్రధానాకర్షణ. రూ.లక్షల విలువైన బాణసంచా కాలుస్తారు. దీన్ని చూసేందుకు వేలాదిగా ప్రజలు వస్తారు.

మాంసాహారానికి దూరం

అంతకాపల్లి గ్రామానికి 3 కిలోమీటర్ల దూరంలో అమ్మవారు కొలువయ్యారు. ఏటా మార్చి నెలలో అమ్మవారి జాతర నిర్వహిస్తారు. అమ్మవారు బ్రాహ్మణ బిడ్డ కావడంతో పండగ చాటింపు నుంచి అనుపు మహోత్సవం వరకు 9 రోజుల పాటు ఈ ప్రాంతం ప్రజలు మాంసాహారం తీసుకోరు. భక్తులకు అసౌకర్యం లేకుండా సకల ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉత్సవ కమిటీ నిర్వాహకులు సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు తెలిపారు.



అంతకాపల్లి జాతరలో కొమ్ము కాలుస్తున్న భక్తులు(ఫైల్)

నేడు వేపగుంటలో తొలేళ్ల సంబరం



వేపగుంటలో కొలువైన ముత్యమాంబ అమ్మవారు

వేపగుంట ఆరాధ్య దేవత ముత్యమాంబ అమ్మవారి వార్షిక పండగ గురువారం భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని కొబ్బరికాయలతో ముస్తాబు చేశారు. వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనానికి తరలివచ్చే అవకాశం ఉండడంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బుధవారం రాత్రి తొలేళ్ల సంబరాన్ని అంతా సిద్ధమైంది. అమ్మవారికి గురువారం వేకువజామునే తొలిపూజ చేసి దర్శనాలు కల్పిస్తారు. పండగ సందర్భంగా అమ్మవారి గర్భగుడి దర్శనం నిషేధించారు.



విజయనగరం రాజులు వేసిన శిలాశాసనం

ముత్యమాంబ స్థల పురాణం

అంతకాపల్లి ముత్యాలమ్మ అమ్మవారికి ఘన చరిత్ర ఉందని స్థల పురాణం గురించి పెద్దలు చెబుతారు. దాదాపు 500 ఏళ్ల క్రితం విజయనగరం సామంతరాజులైన తంగిడగుడం వంశీయులు పాలించేవారు. నాటి సామంతరాజులు కప్పం వసూళ్లకు ఈ ప్రాంతానికి వచ్చేవారు. ఈ క్రమంలో అప్పటి యువరాజు పన్ను వసూళ్లకు వచ్చి అపురూప లావణ్యవతి అయిన ముత్యాలమ్మ అనే బ్రాహ్మణ కన్యను అంతకాపల్లిలో చూసి, ఇష్టపడి, వివాహం చేసుకున్నాడు. ఆమె అంతుచిక్కని వ్యాధితో మరణించింది. తనపై ఉన్న ప్రేమతో ఆ రాజు ఆమెకు గుడి కట్టించాడు. దీని ఆనవాళ్లు శాసనాల రూపంలో ఈ ప్రాంతంలో దర్శనమిస్తాయి. అమ్మవారి మూలవిరాట్ తమ గ్రామంలోనే ఉండాలంటూ అంతకాపల్లి, బంగారమ్మపాలెం గ్రామస్తుల మధ్య వివాదం తలెత్తింది. ఒకనాటి రాత్రి బంగారమ్మపాలెం పెద్దలు అంతకాపల్లిలో ఉన్న అమ్మవారి మూలవిరాట్‌ను ఎడ్ల బండిపై తరలించేందుకు ప్రయత్నించారు. గ్రామ పొలిమేరకు వెళ్లేసరికి బండి చక్రాలు భూమిలో కూరుకుపోయాయి. ఎంతగా ప్రయత్నించినా బండి కదలకపోవడంతో మూలవిరాట్‌ను అక్కడే వదిలి వెళ్లిపోయారు. దీంతో అమ్మవారికి అక్కడే ఆలయం నిర్మించారు. అప్పటి నుంచి అంతకాపల్లి, రావలమ్మపాలెం, ఒమ్మివానిపాలెం, బంగారమ్మపాలెం, జంగాలపాలెం, ఎ.శిరసపల్లి తదితర గ్రామాల ప్రజలు ఉత్సవాలు చేయడం ప్రారంభించారు.

దివ్యాంగ బాలలకు ఎన్టీపీసీ వితరణ



దివ్యాంగ బాలలతో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ

పరవాడ: స్థానిక దివ్యాంగ బాలల శ్రేయస్సుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అభినందించారు. దివ్యాంగ బాలల ఉపకరణాల వితరణకు ఎన్టీపీసీ రూ.12.99 లక్షలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా దీపాంజలినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని, మాట్లాడారు. దివ్యాంగ బాలల విద్యాభివృద్ధి, అవసరమైన ఉపకరణాల పంపిణీకి ఎన్టీపీసీ సమకూర్చిన నిధులను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. సమగ్ర శిక్ష పథక సంచాలకులు డాక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో 43 భవిత కేంద్రాలకు గతంలో ఎన్టీపీసీ యాజమాన్యం రూ.12 లక్షలతో ఉపకరణాలు అందజేశారని, తాజాగా అనకాపల్లి జిల్లాలోని 24 భవిత కేంద్రాలు, ఆరు సహిత విద్యా రిసోర్స్ రూములు, ఉపకరణాలకు రూ.12.99 లక్షలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ మాట్లాడుతూ సంస్థ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్య, వైద్యం, బాలికా సాధికారిత, ఉపకార వేతనాలు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ఎన్టీపీసీ సమకూర్చిన ఉపకరణాలను మండలాల వారీగా ఆయా భవిత కేంద్రాల నిర్వాహకులకు కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి బి.శకుంతల, రిసోర్స్ పర్సన్‌లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

పరవాడ: స్థానిక జేఎన్‌పీసీ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఈ నెల 13న సీజీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీ కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. వినియోగదారులు పరిష్కారం కాని సమస్యలకు పరిష్కారం పొందవచ్చు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ (రిటైర్డ్ జడ్జి), సంస్థ అధికారులు పాల్గొంటారని పేర్కొంది.

వైభవం.. గ్రామ దేవతల పండగ మహోత్సవం



తానాం గ్రామంలో పరదేశిమాంబ బోనాల ఊరేగింపు



ప్రత్యేక అలంకరణలో పరవాడ పైడిమాంబ అమ్మవారు



పరదేశిమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: మండలంలోని పరవాడ, తానాం, దేశపాత్రునిపాలెం గ్రామాల్లో కొలువుదీరిన పైడిమాంబ, పరదేశిమాంబ, పోలమాంబ పండగ మహోత్సవాలను మంగళవారం ఆయా గ్రామాల ప్రజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జాము నుంచి అమ్మవార్ల ఆలయాలకు భక్తులు బారులు తీరారు. పసుపు కుంకుమలు, మొక్కులు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. పరవాడ మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, తానాం సర్పంచ్ కన్నూరి దేవి వెంకటరమణ, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, కూటమి నాయకులు వర్రి పరదేశినాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, బుగిడి రామగోవిందరావు, వియ్యపు చిన్నా, పైల రామచంద్రరావు తదితరులు అమ్మవారిని దర్శించుకని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పరవాడ పైడిమాంబ అమ్మవారిని పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు దర్శించుకుని పూజలు నిర్వహించారు. రాత్రికి గ్రామ దేవతలను డప్పు వాయిద్యాలు, చిడతలు, నేల డ్యాన్సులతో పురవీధుల్లో ఊరేగించారు. బాణ సంచా కాల్పులతో అమ్మవార్ల అనుపు మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

'యువత పోరు'ను విజయవంతం చేయాలి



పార్టీ ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న అదీప్‌రాజ్

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం జిల్లా కలెక్టరేట్ల వద్ద తలపెట్టిన 'యువత పోరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్య నాయకులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గం నుంచి అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్దకు భారీగా పార్టీ శ్రేణులు తరలి రావాలన్నారు. ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా యువత, విద్యార్థులు 'యువత పోరు'లో పాల్గొని నినదించాలని కోరారు. సీనియర్ నాయకులు శరగడం చిన అప్పలనాయుడు, బయిలపూడి భగవాన్ జయరాం, గండి రవి, కొటాన రాము, మనాలత జోబ్‌దాస్, గొరపల్లి శ్రీను, మెంటి మహేష్, రాపర్తి మాధవరావు, తామర్ల నర్సింగ్, చిరికి దేముడు పాల్గొన్నారు.

క్రీడల్లో డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థుల ప్రతిభ



విజేతలతో వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు, సిబ్బంది

సబ్బవరం: స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) విద్యార్థులు ఈ నెల 6 నుంచి 10 వరకు కోల్‌కతాలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ జ్యూరీడికల్ సైన్సెస్(ఎన్‌యూజేఎస్)లో జరిగిన వార్షిక క్రీడా ఉత్సవంలో ప్రతిభ కనబరిచారు. వర్సిటీ నుంచి 65 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. దేశంలోని వివిధ విద్యాలయాల నుంచి 25 జట్లు పాల్గొన్న ఈ పోటీలలో డీఎస్ఎన్ఎల్‌యూ రన్నర్‌గా నిలిచిందన్నారు. పురుషుల విభాగంలో బాస్కెట్‌బాల్, వాలీబాల్, మహిళ విభాగంలో త్రో బాల్, బ్యాడ్మింటన్, బహుళ ట్రాక్ ఈవెంట్లలో బంగారు పతకాలు సాధించారు. క్రికెట్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, అథ్లెటిక్స్‌లో రజత పతకాలు, షాట్‌పుట్, లాంగ్ జంప్, హైజంప్ ఈవెంట్లలో కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు విజేతలను మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ మంగరాజు, స్పోర్ట్స్ కమిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూర్‌బాషా కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



సమావేశంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

పెందుర్తి: మైనారిటీల్లో వెనుకబడిన, అణగారిన వర్గానికి చెందిన నూర్‌బాషా/దూదేకుల ముస్లింలను ప్రభుత్వం ఆదుకోవాలని ఉమ్మడి విశాఖ నూర్‌బాషా బీసీ ముస్లిం సంక్షేమ సంఘం ప్రతినిధి ఇస్మాయిల్ కోరారు. పెందుర్తిలోని ఆ సంఘ భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి నూర్‌బాషా కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలన్నారు. ఎమ్మెల్సీ కోటాలో తమకు అన్యాయం జరిగిందని, రానున్న రోజుల్లో అయినా చట్టసభల్లో తమకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. ఇతర ప్రభుత్వ కమిటీలు, వక్ఫ్ పాలక వర్గాల్లో తమకు తగిన గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు ఖాన్ సాహెబ్, ఎస్కే సాహల్, షేక్‌బాబ్జి, షేక్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

పురాతన యుద్ధ కళ థాంగ్ టా



థాంగ్-టా క్రీడాకారులతో ప్రిన్సిపాల్ వసంతదేవి

పరవాడ: థాంగ్-టా కళను అభ్యసించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు విద్యార్థులు ముందుకు రావాలని బాల భారతి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వసంతదేవి పిలుపునిచ్చారు. దీపాంజలినగర్‌లోని స్కూల్లో 15వ ప్రపంచ థాంగ్-టా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ థాంగ్-టా భారతీయ పురాతన యుద్ధ కళ అన్నారు. పీఈటీ షెల్టన్‌జేమ్స్ మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఖేలో ఇండియా, యూత్‌గేమ్స్‌లో ఈ క్రీడ గుర్తింపు పొందిందన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించాలి

పరవాడ: విజయవాడలో బుధవారం నిర్వహించనున్న ఛలో విజయవాడ కార్యక్రమానికి ఉపాధి కూలీలందరు పాల్గొని విజయవంతం చేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. మంగళవారం బొడ్డపువానిపాలెం చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను సందర్శించి కూలీల సమస్యలను, అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు బకాయి పడ్డ ఆరు వారాల వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పనిచేసిన కూలీలకు పే స్లిప్‌లు అందించాలన్నారు. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లింపుతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సింహాద్రి ఎన్టీపీసీ కలెక్టర్ సందర్శన



ఎన్టీపీసీ సోలార్ విద్యుత్ ప్లాంట్‌లో విజయ కృష్ణన్

పరవాడ: అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మంగళవారం సింహాద్రి ఎన్టీపీసీని సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కంట్రోల్ రూమ్‌లోని మహిళా ఉద్యోగులతో కాసేపు ముచ్చటించారు. ప్లాంట్‌లోని మోడల్ రూం పనితీరును తెలుసుకున్నారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను సందర్శించారు. సందర్శనలో భాగంగా పవర్ ప్లాంటు కార్యకలాపాలు, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. బొగ్గు రవాణా సేకరణ లింకేజీలు, షెడ్యూల్ ప్రక్రియపై చర్చలు జరిపారు. సమర్థవంతమైన ఇంధన ఉత్పత్తికి ఎన్టీపీసీ సింహాద్రి చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ వెంట సింహాద్రి ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ, ప్లాంట్ హెచ్ఆర్ బి.బి.పాత్ర, సీనియర్ అధికారులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం, బోదువలస గ్రామాల్లో పాడి పశువులకు మంగళవారం గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ పశు వైద్య శిబిరాన్ని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రామమోహన్‌రావు, విశాఖ డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ చంద్రశేఖర్ సందర్శించారు. ఈ టీకా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సబ్బవరం ఏడీ డాక్టర్ ఉషాకుమారి, వెటర్నరీ డాక్టర్ బి.సంధ్య పాల్గొన్నారు.

పరదేశిమాంబ పండగ సందడి



అమ్మవారి సన్నిధిలో అదీప్‌రాజ్, తదితరులు

సబ్బవరం: మండలంలోని తవ్వవానిపాలెంలో కొలువైన పరదేశిమాంబ అమ్మవారి పండగ మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పార్టీ శ్రేణులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామంలో నిర్వహించిన గుర్రపు పందాలను ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్, మండల కన్వీనర్ కర్రిబాబు, నాయకులు బోకం రామునాయుడు, కొటాన రాము, బోకం బాలు, బోకం శ్రావణ్, బోకం కాసుబాబు, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, గొల్లలపాలెం సర్పంచ్ మోపాడ అప్పారావు, పాలిశెట్టి సురేష్‌రాజ్, గొర్లి రాజేష్, వడ్డాలి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కుమార్ గౌరవ్‌కు ఘన నివాళి

పరవాడ: దివంగత కుమార్ గౌరవ్(డీజీఎం కెన్రందారి సీఎంపీ)కు సింహాద్రి ఎన్టీపీసీ ఉద్యోగులు కుటుంబాలతో కలిసి మంగళవారం కొవ్వొత్తులు పట్టుకుని మౌనం పాటించి, నివాళి అర్పించారు. సంస్థ ఈడీ సమీర్‌శర్మ బాధితుల కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో జీఎం పి.కె.జెనా, బి.బి.పాత్ర, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం



విజేతలకు బహుమతులు అందిస్తున్న మళ్ల విజయ్‌ప్రసాద్, మళ్ల అనూష

పెందుర్తి: విస్తం ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయ్‌ప్రసాద్ అన్నారు. పినగాడి సమీపంలోని విస్తం కళాశాలలో జరుగుతున్న 'స్పోర్ట్స్ మీట్-2025'మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరచూ క్రీడల్లో పాల్గొనడం వల్ల వారిలో ఐక్యత పెరుగుతుందన్నారు. కళాశాల ప్రెసిడెంట్ మళ్ల అనూష మాట్లాడుతూ విస్తంలో విద్యార్థులకు కావలసిన అన్ని వసతులు సమకూర్చామన్నారు. ఆల్‌రౌండ్ ప్రతిభ కనబరిచిన కంప్యూటర్ సైన్స్ విభాగానికి ప్రత్యేక బహుమతి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత బయిలపూడి భగవాన్ జయరామ్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రమణారావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.సాయి రామానాయుడు, విభాగాధిపతులు పాల్గొన్నారు.